క్లుప్తంగా

పరిగి ఎస్‌ఐగా రంగడు యాదవ్



పరిగి: మండల నూతన ఎస్‌ఐగా రంగడు యాదవ్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

29న జాబ్‌మేళా

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లోని దివ్యాంగుల సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 29న పెనుకొండలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు తెలిపారు. 20 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ వరకూ ఉత్తీర్ణత సాధించి 18 -32 ఏళ్ల వయస్సు లోపు ఉన్నవారు అర్హులన్నారు. పెనుకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. వివరాలకు 6364867797, 6364867798 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సర్పంచ్‌కు పరామర్శ



సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లిలో ఈ నెల 17న టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన సర్పంచ్ పరంధామ, అతని సోదరుడు ముత్యాలప్పను మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పరామర్శించారు. బుధవారం గ్రామానికి చేరుకొని దాడి ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడొద్దని అవసరమైతే న్యాయపరంగా పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సర్పంచులు అంజి నాయక్, జిలాన్‌ఖాన్, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లేపాక్షి: మండలంలోని రాజీవ్‌కాలనీకి చెందిన కదిరప్ప కుమారుడు నరసింహమూర్తి (35) అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్‌ఐ గోపీ బుధవారం తెలిపారు. మృతుడు తాగుడుకు బానిసై డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడన్నారు. డబ్బులు ఇవ్వకపోతే చనిపోతానని బెదిరించి ఈనెల 16న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడన్నారు. చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడన్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతను పాటిస్తూ విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని డీవైఈఓ రంగస్వామి సూచించారు. బుధవారం ఆయన స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, కంప్యూటర్‌లో నమోదైన వివరాలను పరిశీలించి సర్దుబాటు వివరాలను ఆరా తీశారు. ఉపాధ్యాయులు తెలిపిన అభ్యంతరాలను తాము పంపామని, అవి సీఎస్‌సీలో మార్పు కావడం లేదని, దీంతో ఒత్తిడి పెరుగుతోందని ఎంఈఓ భాస్కర్ ఆయన దృష్టికి తీసుకోచ్చారు. వాటిని డివిజన్ స్థాయి కౌన్సిలింగ్ లోపు పరిశీలించి న్యాయం చేస్తామని ఆయన సమాధానం ఇచ్చారు.

బోల్తా పడిన ఐచర్



పెనుకొండ రూరల్: టైరు పంక్చర్ అవడంతో అదుపు తప్పి ఐచర్ వాహనం బోల్తా పడిన సంఘటన పెనుకొండ 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకొంది. చింతామణి నుంచి కోసు గడ్డ(క్యాబేజి) లోడుతో చత్తీస్‌ఘడ్ వెళ్తున్న ఐచర్ వాహనం హరిపురం వై జంక్షన్ వద్దకు రాగానే టైరు పంక్చర్ అయింది. అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొని సుమారు పది అడుగుల లోతులో పడిపోయింది. డ్రైవర్ జగన్నాథ్, క్లీనర్ రాంజీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.అయితే వాహనంలోని జాకీ కిట్, బ్యాటరీ తదితర విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయని డ్రైవర్ జగన్నాథ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- ఇప్పటికే కొంకల్లు, ఎంరాయాపురంలో 10 మందిని బలిగొన్న అతిసారం
- సీజనల్ వ్యాధిగ్రస్తులతో మడకశిర ఏరియా ఆస్పత్రి ఫుల్
- కనీస సౌకర్యాలు లేక రోగుల ఇబ్బందులు
- పారిశుధ్యం, మరుగుదొడ్ల పరిస్థితిపై ఆర్డీఓ తీవ్ర అసంతృప్తి



మడకశిర ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీజనల్ వ్యాధిగ్రస్తులు

మడకశిర: నియోజకవర్గంలో సీజనల్ వ్యాధులు పెద్ద ఎత్తున ప్రబలుతున్నాయి. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతంలో కూడా వైద్యం పడకేసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా సరిగ్గా స్పందించకపోవడంతో అన్నిచోట్లా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రిగా జిల్లాకు చెందిన సత్యకుమార్‌యాదవ్ పని చేస్తున్నా ప్రజలకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలందడం లేదని పెద్ద ఎత్తున విమర్శలున్నాయి. కొంకల్లు, ఎంరాయాపురం గ్రామాల్లో అతిసారం సోకి దాదాపు 10 మంది మృత్యువాత పడడమే దీనికి నిదర్శనమంటున్నారు.

మడకశిర ఏరియా ఆస్పత్రి కిటకిట

మడకశిర ఏరియా ఆస్పత్రి సీజనల్ వ్యాధిగ్రస్తులతో కిటకిటలాడుతోంది. అతిసారం సోకిన కొంకల్లు,ఎంరాయాపురం గ్రామాలకు చెందిన కొంత మంది చికిత్స పొందుతున్నారు. అదే విధంగా వైరల్ ఫీవర్ వ్యాధిగ్రస్తులు కూడా పెరుగుతున్నారు. డయేరియా కేసులు కూడా రోజూ వస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా కేసులు నియోజకవర్గవ్యాప్తంగా పెరుగుతున్నాయి. దీంతో సీజనల్ వ్యాధిగ్రస్తులతో ఏరియా ఆస్పత్రి నిండిపోయింది. అయితే వీరికి ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేవని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. మంచాలు కూడా కరువవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు.

వైద్యసిబ్బందిపై ఆర్‌డీఓ ఆగ్రహం

పెనుకొండ ఇన్‌చార్జ్ ఆర్డీఓ వెంకటశివారెడ్డి మంగళవారం అర్ధరాత్రి మడకశిర ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. కొంకల్లు,ఎంరాయాపురం గ్రామాలకు చెందిన అతిసారం వ్యాధి గ్రస్తులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆస్పత్రిని మొత్తం తిరిగి పారిశుధ్యం అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా మరుగుదొడ్లను కూడా పరిశీలించారు. మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేకపోవడంతో సిబ్బందిపై ఆర్డీఓ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పారిశుధ్యం,మరుగుదొడ్లు ఇలా ఉంటే రోగులకు ఇబ్బందులు కలగదా? అని ప్రశ్నించారు. పారిశుధ్యం లోపించి దుర్వాసన వస్తే రోగులు ఆస్పత్రిలో ఎలా ఉంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఈ ప్రాంతానికి చెందిన డయేరియా, సీజనల్ వ్యాధిగ్రస్తులు స్థానికంగా వైద్య సేవలు పొందక కర్ణాటక ప్రాంతాలకు ఎందుకు వెళుతున్నారని డాక్టర్లను ప్రశ్నించారు. అతిసారం సోకిన వారికి స్థానికంగానే మెరుగైన వైద్య సేవలందించి కర్ణాటకకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లను శుభ్రం చేయించాలన్నారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని అతిసార బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అతిసారం బారిన పడి ఇక ఏఒక్కరూ కూడా మృతి చెందకూడదని స్పష్టం చేశారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత పారిశుధ్యం పూర్తిగా లోపించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వర్షాకాలం వచ్చిన వెంటనే సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేవారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసేవారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. పారిశుధ్యంపై ఫోకస్ పెట్టి సీజనల్ వ్యాధులు రాకుండా నివారించేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి.

ఆస్పత్రిని సందర్శించిన జేసీ, డీసీహెచ్‌ఎస్:

మడకశిర ఏరియా ఆస్పత్రిని మంగళవారం రాత్రి జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులను అడిగి వైద్య సేవలపై ఆరా తీశారు. అదే విధంగా డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్ కూడా మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం మడకశిర ఆస్పత్రిని సందర్శించారు. అతిసార బాధితులతో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని డాక్టర్లను ఆదేశించారు.

కొంకల్లు గ్రామాన్ని సందర్శించిన ఆర్డీఓ



కొంకల్లులో పర్యటిస్తున్న ఆర్డీఓ వెంకటశివారెడ్డి

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు గ్రామాన్ని బుధవారం పెనుకొండ ఇన్‌చార్జ్ ఆర్డీఓ వెంకటశివారెడ్డి సందర్శించారు. అతిసార సోకడంతో ఇది వరకే ఏడు మంది వరకూ మృతి చెందారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులతో పాటు అతిసార బాధితులపై ఆయన ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు చికిత్స అందించారు. తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ నాగరాజునాయక్, సర్పంచ్ కవిత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్ బాధితులే ఎక్కువ

మడకశిర ఆస్పత్రికి వైరల్ ఫీవర్ బాధితులు ఎక్కువగా వస్తున్నారు. డయేరియా కేసులు కూడా వస్తున్నాయి. రోజూ సీజనల్ వ్యాధులకు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయి. బాధితులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం.

– డాక్టర్ దివాకర్, ఆర్ఎంఓ,
మడకశిర ఏరియా ఆస్పత్రి .

భక్తిశ్రద్ధలతో గంగపూజ



పార్టీ శ్రేణులతో కలిసి గంగ పూజ నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: వరుణ దేవుడు కరుణా కటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, సకాలంలో వర్షాలు పడి ప్రజలంతా సుఖ సంతోషాలతో వెలుగొందాలని గంగామాతను కోరుతున్నానని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం మండలంలో ఆమె పర్యటించారు. శ్రీరంగరాజుపల్లి వద్ద పరిగి చెరువుకు వెళ్లే ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న వరద నీటికి గంగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళ హారతులిచ్చి, చీర సారెను సమర్పించారు. కార్యక్రమంలో పరిగి సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహామూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, రామాంజి, హనుమంతు, ముఖ్య నాయకులు సింగారెడ్డి, శివరామిరెడ్డి, బద్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



హరినాథరెడ్డి (ఫైల్)

లేపాక్షి: మండలంలోని కల్లూరుకు చెందిన శంకర్‌రెడ్డి కుమారుడు హరినాథరెడ్డి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపీ తెలిపారు. విద్యార్థి హిందూపురం పట్టణంలోని నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడని విద్యార్థి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళతానని చెప్పి ఆటోలో వెళ్లి హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో దిగి కళాశాలకు వెళ్లలేదన్నారు. ఇంటికి సైతం వెళ్లలేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ‘భారత్ బంద్’



జూనియర్ కాలేజీని బంద్ చేయిస్తున్న మాలమహానాడు నాయకులు

మడకశిర/గుడిబండ/అగళి/అమరాపురం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం భారత బంద్‌లో భాగంగా మడకశిర బంద్ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో పాక్షికంగా బంద్ జరిగింది. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు తిరిగాయి. వ్యాపార సంస్థలు పాక్షికంగా మూత పడ్డాయి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు కూడా మధ్యాహ్నం వరకు మూతపడ్డాయి. మాల మహానాడు నాయకులు విద్యాసంస్థలను బంద్ చేయించారు. మాల మహానాడు కార్యదర్శి సోమ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ చేస్తే మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుని మాలలకు న్యాయం చేయాలని కోరారు. గుడిబండ, అగళి, అమరాపురం మండలాల్లోనూ మాలమహానాడు నాయకులు నిరసన తెలిపి బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు బీఆర్.పాండురంగప్ప , మాల మహానాడు సభ్యులు వెంకటస్వామి, నారాయనప్ప, బాలకృష్ణ, సిద్ధప్ప, అమరాపురం మండలాధ్యక్షుడు నరసింహమూర్తి, జయరామప్ప, కార్యదర్శి నాగరాజు, మహిళా నాయకురాలు నాగరత్నమ్మ, మేవా అధ్యక్షుడు సి.తిప్పేస్వామి, డాక్టర్ జె.రమేష్, మారుతీ, హరికృష్ణ, రాజప్ప, కృష్ణమూర్తి, నాగేంద్ర, పి.మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు ఉరి శిక్ష విధించాలి



హిందూపురంలో ర్యాలీ చేస్తున్న ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ సభ్యులు, మహిళలు



మడకశిర: వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



చిలమత్తూరు: మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

హిందూపురం టౌన్: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. బుధవారం సీఐటీయూ పిలుపుమేరకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కార్యకర్తలు, లబ్ధిదారులు, పిల్లలతో నిరసన చేపట్టారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ డాక్టర్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలన్నారు. హంతకులకు ఉరి శిక్ష విధించాలన్నారు.

హిందూపురం: కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలి హత్యకు నిరసనగా ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ కన్వీనర్ సి.బాల ఆధ్వర్యంలో బుధవారం హిందూపురంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు స్త్రీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శంకరయ్య, ఏహెచ్‌ఓ సభ్యులు బాలాజీ, మోహన్‌సాయి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: కోల్‌కత్తా ఘటనకు నిరసనగా ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్, ఆర్డీటీ, ఎంజేపీ కళాశాల సిబ్బంది సంయుక్తంగా నిరసనకు దిగారు. తొలుత గ్రామ పుర వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. తర్వాత కోల్‌కత్తా ఘటనకు బాధ్యులైన వారికి ఉరి శిక్ష విధించాలన్నారు. సీడీపీఓ పద్మావతి, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున, ఎంజేపీ ప్రిన్సిపాల్, ఆర్డీటీ, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ లేపాక్షిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. హిందూపురం ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, సీఐటీయూ నాయకులు రాజప్ప, ధనమ్మ, భాగ్యమ్మ, రూపా తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, విద్యార్థినులు బుధవారం నిరసనకు దిగారు. కోల్‌కత్తా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ఆందోళన నిర్వహించారు. ప్రధాన వీధులగుండా అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు.అదే విధంగా అంబేడ్కర్ సర్కిల్‌లో కూడా ఈఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. సీపీఐ తాలూకా కార్యదర్శి పవిత్ర, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శ్రీదేవి, ఉష, ఆర్డీటీ ప్రతినిధి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తు బుధవారం గోరంట్లలోని ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులు నిరసన ర్యాలీ చేశారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అగళి: ట్రైనీ డాక్టర్ హత్యకు నిరసనగా బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

నాగదేవత ఆలయానికి భూమి పూజ



పుట్టలో కనిపిస్తున్న నాగుపాము



పుట్ట నుంచి బయటకు వస్తున్న నాగుపాము

- ప్రత్యక్షమైన నాగుపాము

హిందూపురం: మండలంలో గొల్లపురంలో వెలసిన అతి పురాతనమైన శివాలయం ఆవరణలో శిథిలావస్థలో ఉన్న పురాతన మండపాన్ని తొలగించి తిరిగి నూతనంగా పునఃనిర్మించేందుకు గ్రామస్తులు సంకల్పించారు. బుధవారం భూమి పూజ చేస్తుండగా పొడవైన ఓ గోధుమ రంగు నాగుపాము ప్రత్యక్షమైంది. పురాతన శివాలయ ముఖ ద్వారం కుడి పక్కన రాతి స్తంభాలతో ఓ మండపం ఉంది. దాని పక్కనే నాగులపుట్ట ఉంది. దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి శివాలయ పునః నిర్మాణం, కల్యాణ మండపం నిర్మించారు. అలాగే ఆలయం ఆవరణలోని మండపాన్ని తొలగించి శివుడి విగ్రహం ప్రతిష్టించనున్నారు. ప్రత్యేక పూజలు జరుగుతుండగా నాగుపాము పూజ చేస్తున్న ప్రదేశంలో వచ్చింది. శివుడి విగ్రహంతో పాటు నాగదేవత విగ్రహాలను ప్రతిష్టించాలని గ్రామస్తులు భావిస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సెరికల్చర్, సివిల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులకు సంబంధించిన గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నెలకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: పట్టణంలోని మోడల్ కాలనీలో మద్యం విక్రయిస్తున్న నాగేంద్రను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. అతని వద్ద నుంచి 480 మద్యం ప్యాకెట్లు, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

దంచికొట్టిన వాన



ఆలూడి చెక్ డ్యామ్ నుంచి ప్రవహిస్తున్న నీరు



ఆలూడిలో నీటిలో మునిగిన మిరప పంట



అమరాపురం మండలం అగ్రహారం ఉన్నత పాఠశాలలో నిలిచిన వర్షపునీరు

రొళ్ల: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి పొర్లాయి. మండల పరిధిలోని శివబాలయోగినగరంలో మహిళ రైతు లక్ష్మమ్మ ఇటీవల సాగు చేసిన వరి పంట పూర్తిగా నీట మునిగింది. అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని బాధితురాలు విన్నవించారు.

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా వానలు దంచి కొట్టాయి. దీంతో పంట పొలాలులో వర్షం నీళ్లు నిలబడ్డాయి. మంగళవారం రాత్రి 31.4 మి. మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

అగళి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప, రాగి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందంటున్నారు. కందపల్లికి చెందిన దేవరాజు రూ.40 వేల ఖర్చు పెట్టి మిరప సాగు చేశాడు. పంట చేతికి అందే సమయంలో భారీ వర్షం కురవడంతో పంట పూర్తిగా దెబ్బతిందని దేవరాజు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అమరాపురం: మండల పరిధిలోని వి.అగ్రహారంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ మొత్తం వర్షపు నీటితో నిండింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు బాత్‌రూముకు వెళ్లాలన్నా, వంట ఏజెన్సీ నిర్వాహకులు వంటగదిలో వంట చేయడానికి వెళ్లాలన్నా భయం పడుతున్నారు. విషపురుగులు ఎక్కడుంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రొళ్ల మండలం శివబాలయోగినగరంలో లక్ష్మమ్మకు చెందిన వరి పంట నీట మునిగిన దృశ్యం



పెనుకొండ మండలం తిమ్మాపురం వద్ద వ్యవసాయ పొలంలో నిలిచిన వర్షపు నీరు

జాతీయ సమ్మేళనం పోస్టర్ల విడుదల

హిందూపురం టౌన్: విశాఖపట్నంలో సెప్టెంబర్ 1, 2, 3వ తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల పోస్టర్లను బుధవారం మున్సిపల్ జేఏసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు విడుదల చేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో మూడు రోజుల పాటు జరిగే జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. 3న కార్మికుల భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. నాయకులు సురేష్, సమీవుల్లా, నౌషాద్, కమల్ బాషా తదితరులు పాల్గొన్నారు.